# 19

# ఆశీర్వచనము: సమాధానము మరియు ఆదరణతో కూడిన ఆశీర్వాదము

## (6:21-24)

పౌలు ఎఫెసీయులకు తన పత్రికను వ్రాయుట ప్రారంభించినప్పుడు, ఆయన తన దృష్టిని సంఘమునకు సంబంధించిన గొప్ప సత్యములపై కేంద్రకరించాడు. సమస్త మానవాళి క్రీస్తు లోనికి, అనగా సమస్త ఆధ్యాత్మిక ఆశీర్వాదములుగల వాని యొద్దకు, తేబడునట్లు చరిత్రలో దేవుడు తన కార్యములను ఎలా చేసాడో ఆయన చూపించాడు. విశ్వాసులు సంఘములో ఒక భాగమగుట ద్వారా దేవునితోను, క్రీస్తుతోను, పరిశుద్ధాత్మతోను ఒక సంబంధమును సంపాదించుకొందురు (1:1–23). మానవుడు తనను తాను రక్షించుకొనలేకుండిన నిస్సహాయుడు మరియు నిరీక్షణలేనివాడునై యుండినప్పటికిని, దేవుడు, తన మహా కనికరము, ప్రేమ మరియు కృపనుబట్టి, పతనమైన మానవుని ఆయనతో కూడ సమాధానపరచుకొనవలెను సంకల్పముతో, తన కుమారుడు సిలువ మీద మరణించినట్లు ఆయనను అనుగ్రహించాడు. దేవుని రక్షణయను వరమును అంగీకరించువారు దేవుని కుటుంబము, ఆయన రాజ్యము, మరియు ఆయన యొక్క ఆధ్యాత్మిక కట్టడములో సభ్యులై యున్నారు (2:1–22); వారు క్రీస్తు శరీరము అనగా, సంఘములో సభ్యులై యున్నారు. ఇదంతా "క్రీస్తునందు" సాధ్యము గావింపబడింది. ఒకడు క్రీస్తులోనికి ఎలా ప్రవేశించగలడో పౌలు గలతీయులకు 3:26, 27 మరియు రోమీయులకు 6:3, 4 మొదలగు వాక్య భాగాల్లో వర్ణించాడు.

మానవునికి యుగయుగాలుగా అర్థంకాని ఒక "మర్మమును" దేవుడు బయలుపర్చాడు. దేవుని గొప్ప సంకల్పమును సమస్త మానవులకు వివరించుట పౌలుకైతేనేమి సంఘమునకైతేనేమి ఒక సవాలై యుండింది. సందేశము యొక్క కీలకమైన వాస్తవమేమనగా, అన్యజనులు, మరియు యూదులు సహితము, సంఘములో భాగమై యుండవచ్చును. ఈ మర్మమును తెలియజెప్పుట ద్వారా సంఘము తన కార్యభారమును సఫలీకృతముగా నిర్వర్తించవలెనని పౌలు సంఘము యొక్క బలము మరియు గ్రహింపు కొరకు ప్రార్థించాడు (3:1–21).

ఈ గొప్ప సత్యములను ఎఫెసీయులకు వ్రాసిన తన పత్రికలోని తొలి సగ భాగములో వారి ముందుంచుచు, ఈ సత్యములను వారి జీవితములలో ఆచరణాత్మకముగా అన్వయింపజేయుట కొరకు రెండవ సగ భాగమును ఉపయోగించాడు. (1) వారు తమ యెడలను, మరియు దేవుడు, ఇతరులు, మరియు వాక్యము యెడలను సరైన వైఖరులు కలిగియుండుట ద్వారా, మరియు నూతన పురుషుని ధరించుట ద్వారా వారు "[వారు] పిలువబడిన పిలుపునకు తగినట్లుగా నడుచుకొనవలెనని" ఆయన వారిని ప్రోత్సాహించాడు. వారు తగిన విధంగా

నడుచుకొనుట వలన వారు క్రీస్తునందు ఐక్యము గలవారౌదురు (4:1–32). (2) వారు "ప్రేమ కలిగి నడుచుకొనవలెనని" వారికి చెప్పాడు. వారు ప్రేమ కలిగి నడుచుకొనునప్పుడు, వారు దేవుని మరియు క్రీస్తును పోలి నడుచుకొనుచున్నవారౌదురు. (3) అంధకార క్రియలను ఎదిరించుట ద్వారా వారు "వెలుగు సంబంధుల వలె నడుచుకొనవలసినవారై" యుండిరి (5:1–14). (4) వారు **ఆత్మ**పూర్ణులై, సమస్త సంబంధములలో పరస్పర అనోన్య మర్యాదను ప్రదర్శించుచు, దేవుడిచ్చు సర్వాంగ కవచమును ధరించి, పట్టుదలతో కూడిన ప్రార్థనలు చేయుచు అంధకార శక్తులకు విరోధముగా నిలువబడుట ద్వారా అజ్ఞానుల వలె గాక జ్ఞానుల వలె జాగ్రత్తగా నడుచుకొనవలెనని ఆయన వారిని సవాలు చేసాడు. దేవుడు ఎఫెసీయులను రక్షించుట మాత్రమే కాదు, కానీ వారు శక్తిమంతమైన దురాత్మల సమూహముపై విజయీభవులగుటకు అవసరమైన వనరులను ఆయన వారికిచ్చునని పౌలు నొక్కివక్కాణించాడు (5:15–6:20).

పౌలు తన పత్రికను ముగించుచు, తన వ్యక్తిగతమైన కొన్ని అభివందనములు అదనంగా చేర్చాడు. వారి మనస్సులు ఆయన గూర్చి ఆందోళన చెందకుండునట్లు, తన సొంత పరిస్థితి విషయంలో అప్పటి వరకు జరిగిన సంగతులను సహోదరులకు సవివరంగా తెలియజెప్పాడు.

## పౌలు పరిస్థితుల గూర్చిన సమాచారము (6:21, 22)

**21మీరును నా క్షేమసమాచారమంతయు తెలిసికొనుటకు ప్రియసహోదరుడును ప్రభువునందు నమ్మకమైన పరిచారకుడునైన తుకికు నా సంగతులన్నియు మీకు తెలియజేయును. 22మీరు మా సమాచారము తెలిసికొనుటకును అతడు మీ హృదయములను ఓదార్చుటకును అతనిని మీయొద్దకు పంపితిని.**

**వచనములు 21, 22.** రోమా పట్టణంలో ఖైదీగా నుండిన తన పరిస్థితి గూర్చిన అభయము ఆయన తన పాఠకులకు ఇచ్చునంత వరకు పౌలు తన ఉత్తరమును ముగించలేదు. ఆయన ఎలా వున్నాడు, ఆయన పరిస్థితేంటో వారికి తెలియజెప్పవలెనను అపొస్తలుని కోరిక మరియు ఆయన గూర్చి తెలిసికొనవలెనని వారికుండిన కోరిక, పౌలు మరియు ఎఫెసీయుల మధ్య నెలకొని యుండిన సన్నిహిత సంబంధము మరియు అన్యోన్య అనురాగమును మనకు స్పష్టంగా తెలియజెప్పుచున్నది.

ఆయన రోమా పట్టణంలో మొదటి సారి చెరసాలలో వేయబడినప్పుడు, పౌలు తన ఉత్తరములు ఎఫెసీయులకు, ఫిలిప్పీయులకు, కొలొస్సయులకు, మరియు ఫిలేమోనుకు వ్రాసాడు. ఆయన చెరసాలలో ఉన్నప్పుడు, ఏదో ఒక సమయంలో, ఆయన స్నేహితులు అనేకులు ఆయనతో కూడా ఉండిరి. ఫిలిప్పీ పట్టణంలో ఉన్నప్పుడు ఆయన తిమోతి మరియు ఎపఫ్రొదితు, వారి పేర్లు పేర్కొనబడని కొందరు "సహోదరులు," మరియు "కైసరు ఇంటివారిలో పరిశుద్ధుల" గూర్చి చెప్పాడు (1:1; 2:19–30; 4:18, 21–23). ఆయన ఫిలేమోనుకు వ్రాసిన ఉత్తరంలో, తిమోతి, ఒనేసిము, ఎపఫ్రా, మార్కు, దేమా, లూకా, మరియు అరిస్తర్కు గూర్చి చెప్పాడు (వచనములు 1, 8–10, 23, 24). ఎఫెసీయులకు వ్రాసిన పత్రికలో తుకికును మాత్రమే పేర్కొన్నాడు. కొలొస్స పత్రికలో తిమోతి, తుకికు,

ఒనేసిము, అరిస్తార్కు, యూస్తు, ఎపఫ్రా, లూకా, మరియు దేమా పేర్లు పేర్కొన్నాడు (1:1, 2; 4:7, 8–12, 14). అందుబాటులో నున్న సమాచారము నుంచి, తుకికు మరియు ఒనేసిము, ఆయన ఎఫెసీయులకు (6:21, 22), కొలొస్సయులకు (4:7–9), మరియు ఫిలేమోనుకు (వచనములు 10–12) వ్రాసిన ఉత్తరములను వారికి అందజేసారనియు, ఆయన ఫిలిప్పీయులకు వ్రాసిన ఉత్తరమును వారికి ఎపఫ్రొదితు అందజేసాడనియు అర్థమగుచున్నది (ఫిలిప్పీయులకు 2:25–30).

**మీరు మా సమాచారము తెలిసికొనుటకును అతడు మీ హృదయములను ఓదార్చుటకును అతనిని మీ యొద్దకు పంపితిని** అంటూ పౌలు తుకికును ఎఫెసీయుల యొద్దకు పంపాడు. తుకికు **ప్రియసహోదరుడును ప్రభువునందునమ్మకమైన పరిచారకుడునై యుండెనని** పౌలు అతనిని వర్ణిస్తూ, ఆయన వ్రాసిన ఉత్తరమును అతడు అందజేయుననియు, సత్యమునే తెలియజెప్పుననియు నమ్మవచ్చునని తద్వారా సూచించాడు.

### సమాధానము మరియు కృపతో కూడిన అభివందనములు (6:23, 24)

**[23]తండ్రియైన దేవునినుండియు ప్రభువైన యేసు క్రీస్తు నుండియు సమాధానమును విశ్వాసముతోకూడిన ప్రేమయును సహోదరులకు కలుగును గాక. [24]మన ప్రభువైన యేసుక్రీస్తును శాశ్వతమైన ప్రేమతో ప్రేమించు వారికందరికిని కృప కలుగును గాక.**

**వచనములు 23, 24.** ఈ ఉత్తరము యొక్క ముగింపు పౌలు వ్రాసిన ఇతర ఉత్తరముల ముగింపు వలెనే ఉన్నది. ఆయన ఈ ఉత్తరమును "మన తండ్రియైన దేవుని నుండియు ప్రభువైన యేసుక్రీస్తు నుండియు మీకు కృపయు సమాధానమును కలుగును గాక" అంటూ మొదలుపెట్టినట్లుగానే, ముగింపులో కూడా **కృప** మరియు **సమాధానము** గూర్చిన ఆలోచనలతో ముగించాడు. దేవుని కృప లోకమునకు రక్షణ తెచ్చింది (2:8, 9), మరియు దేవుని కృపాసహితమైన వరమును అంగీకరించుట వ్యక్తిగత క్రైస్తవులకు సమాధానము కలుగజేస్తుంది (2:13–22). దేవుడు క్రీస్తు నందు ప్రదర్శించిన కృప మరియు సమాధానము యెడల సరైన ప్రతిస్పందన **ప్రేమ** మరియు **విశ్వాసము**నకు సంబంధించినదై యున్నది. ప్రేమ మరియు విశ్వాసము **దేవుని చేత** అనుగ్రహింపబడినవని ఈ వాక్యభాగము సూచించుచున్నది. దేవుని కృప మరియు అనుగ్రహము **క్రీస్తును** ప్రేమించు వారి యెడల కూడా ప్రదర్శింపబడవలెనని పౌలు ప్రార్థించాడు.

విశ్వాస సహితమైన ప్రతిస్పందన, ఇదే ఉత్తరములో మరొక చోట పేర్కొనబడింది (1:15; 2:8; 3:12, 15–18; 4:11; 6:16), ఎల్లప్పుడు ఒప్పింపు నమ్మకము, మరియు విధేయతకు చూపింపబడు ఒక ప్రతిస్పందనయై యుండవలెను. లేదంటే, అట్టి విశ్వాసము మృతమైనదే (యాకోబు 2:13 చూడుము). క్రైస్తవులు దేవుని చిత్తమును నెరవేర్చునట్లు ప్రేమ వారికి ప్రోత్సాహకమిస్తుంది (యోహాను 14:15; 2 కొరింథీయులకు 5:14 చూడుము).

24వ వచనంలోని ముగింపు మాటల పట్ల అనగా, **శాశ్వతమైన ప్రేమతో** అను మాటల పట్ల, కొంత సావధానము చూపింపబడవలెను. "ప్రేమ" అను పదము అనువాదకుల చేత అదనంగా చేర్చబడింది. నామవాచక పదము *Aphtharsia*, "నశించని లక్షణమును"

సూచిస్తుంది.[1] నిత్యము నిలుచు మహిమ మరియు నిత్య జీవము యొక్క గౌరవము ప్రస్తావింపబడిన సందర్భములో ఈ పదము రోమీయులకు 2:7లో “అక్షయము” అని అనువదింపబడింది. 1 కొరింథీయులకు 15:42, 50, 53, 54లో, అది పునరుత్థానమైన శరీరము యొక్క “అక్షయతను” సూచిస్తుంది (NKJV); మరియు 2 తిమోతి 1:9, 10లో, అది క్రీస్తు చేత సువార్త ద్వారా వెలుగులోనికి తేబడిన “అక్షయత” గూర్చి చెప్పుచున్నది. aphtharsia అను పదమును పౌలు ప్రయోగించుటలో ఏదియు దానిని (KJV మరియు NKJVలో అగుపించుచున్నట్లుగా) “మనఃపూర్వకము” అని అనువదించుటను సమర్థించుట లేదు.

పౌలు చెప్పుచుండిన “అక్షయత” యను లక్షణము దేవుని అమరత్వమును వర్ణించుట లేదు, సరికదా అది “కృప” యొక్క అమరత్వపు స్వభావమును కూడా వివరించుట లేదు. ఇంకా, విశ్వసనీయులైన క్రైస్తవులకు అనుగ్రహింపబడిన నిత్యజీవము గూర్చి కూడా అది చెప్పుట లేదు. దానికి బదులుగా, ‘శాశ్వతకాలముండుట’ గూర్చిన ఈ భావన “ప్రేమ” తో జోడింపబడవలెను, ఏలయనగా అది “[క్రైస్తవుల] ప్రేమ విధానమును, లేదా వారి ప్రేమ దాని ఉనికి కలిగియున్న అంశమును ఉత్తమోత్తమంగా నిర్వచించుచున్నది.” అది మార్పునగాని … కృశించుటనుగాని ఎరుగని ప్రేమయై యున్నది.’”[2] “మన ప్రభువైన యేసు క్రీస్తును నశించని ప్రేమతో ప్రేమించువారందరు,” మార్పునుగాని కృశించుటనుగాని ఎరుగని ప్రేమతో ప్రేమించువారందరును, దేవుని కృపను పొందుదురు.

## అన్వయము

### పొగడబడని వీరులు (6:21–24)

పౌలు ఎఫెసీయులకు వ్రాసిన తన పత్రికలో పలుకుచున్న ఆశీర్వచనము ఆయన ఇతర పత్రికలలో రచించినటువంటిదే అయియున్నది, అవి సంఘములోని ఆయన జతపనివారిని కొందరిని పేర్కొన్నవి. ఈ ఆశీర్వచనములు పొగడబడని సువార్త వీరులను – గుర్తింపు ఇవ్వబడకుండానే, సువార్తను ప్రపంచ నలుమూలల్లో ప్రకటించుటకు, కార్యసార్థకముగాను నమ్మకముగాను పనిచేసినవారిని – మనస్సుకు జ్ఞప్తిచేయుచున్నవి.

విశ్వాస వీరులు లేఖనములలో తరచుగా పేర్కొనబడలేదు. అపొస్తలుల కార్యములు 11:19–26 ప్రకారము, మానవ చొరవ చేత సువార్త అన్యజనులకు మొట్టమొదటిసారి ప్రకటింపబడింది. ఫిలిప్పు అంతకు మునుపు సమరయులకు సువార్త ప్రకటించి యుండెను, కానీ వారిలో కొందరు యూదులై యుండిరి. పేతురు కొర్నేలీకి, ఒక అన్యజనునికి, సువార్త ప్రకటించాడు, కానీ అది దేవుని ప్రేరణయై యుండింది. అపొస్తలుల కార్యములు 11వ అధ్యాయంలో, అప్పుడే ఉద్భవించి బాల్య దశలో నున్న సంఘములో సంభవించిన ఒక అత్యంత ప్రాముఖ్యమైన సంఘటనను మనము గమనించగలము: సువార్త అంతియొకయలోని అన్యజనులకు ప్రకటింపబడింది, అచ్చట స్థాపింపబడిన సంఘము నుంచి, తద్వారా రోమా సామ్రాజ్యమంతటికిని సువార్త ప్రకటింపబడిన మూడు గొప్ప మిషనెరీ ప్రయాణాలను పౌలు లాంఛనప్రాయంగా చేపట్టాడు. ఏది ఏమైనా, సువార్త ప్రకటన పనులను ప్రారంభించినవారు ఎన్నడును పేర్కొనబడ లేదు.

ప్రభువునందు సోదర సోదరీమణులైన అనేకులు పౌలుకు సహాయం చేసారు. ఆయన చెరసాలలో ఉన్నప్పుడు వ్రాసిన పత్రికలలో – ఎఫెసీయులకు, ఫిలిప్పీయులకు, కొలొస్సయులకు, మరియు ఫిలేమోనుకు – ఆయనకు ముఖ్యులై యుండి క్రీస్తు రాజ్య వ్యాప్తిలో పాటుపడిన పన్నెండు మంది తోటి పనివారి పేర్లు ఆయన పేర్కొన్నాడు. అయితే వారి గూర్చి మనకు తక్కువగా చెప్పబడింది, కానీ ఆయన ప్రభువు కొరకు చేయుచుండిన పరిచర్యలో వారు పౌలుకు సహాయ సహకారులై యుండిరని మనము తెలిసికొనగలుగుచున్నాము.

సంఘములోని సభ్యులందరును ప్రాముఖ్యమైనవారు కారని, సంఘము క్రీస్తు “శరీరమై యున్నదను” సోదాహరణ చిత్రీకరణము (రోమీయులకు 12; 1 కొరింథీయులకు 12) చూపిస్తుంది. వారు సంఘములో ఉపచారము చేయునప్పుడు, ప్రతి సభ్యుడు తన తన పాత్ర సక్రమంగా వహించినప్పుడు సంఘము సఫలీకృతముగా పనిచేస్తుందని క్రైస్తవులు జ్ఞాపకముంచుకొనవలెను (4:16). మనలో ప్రతి ఒక్కరి పేరు ప్రధానాంశాల్లో ప్రథమంగా పేర్కొనబడదు లేదా ఇతరుల చేత జ్ఞాపకం చేసినకొనబడదు, కానీ మన అందరి పేర్లు జీవగ్రంథములో లిఖింపబడి యున్నవి గనుక వాటిని దేవుడు జ్ఞాపకం చేసికొంటాడు. తుకికులందరికి – పౌలుకు తోడ్పడుచు ఆయనకు సహాయము చేయువారందరికి – మనము వందనస్తులమై యున్నాము. మనమందరము కలిసికట్టుగా పనిచేసినప్పుడు, అది ముందు వరుసలోనైనా లేక తెర వెనుకయైనా, మనము దేవుని చేత దీవింపబడుచున్నాము గనుక ఆయన రాజ్య వ్యాప్తి కార్యము కొనసాగుచుండును.

జేయ్ లాక్‌హార్ట్

---

సూచనలు

[1]Andrew T. Lincoln, *Ephesians,* Word Biblical Commentary, vol. 42 (Dallas: Word Books, 1990), 467; కూడ చూడు Walter Bauer, *A Greek-English Lexicon of the New Testament and Other Early Christian Literature,* 3d ed., rev. and ed. Frederick William Danker (Chicago: University of Chicago Press, 2000), 155. [2]S. D. F. Salmond, "The Epistle to the Ephesians," in *The Expositor's Greek Testament,* ed. W. Robertson Nicoll (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1967), 3:395–96; Charles John Ellicott, *St. Paul's Epistle to the Ephesians: With a Critical and Grammatical Commentary, and a Revised Translation,* 5th ed. (London: Longmans, Green & Co., 1884), 159లో Salmond ఉదహరించాడు.